ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
జయశంకర్ భూపాలపల్లి
ఆదివారం 17 ఆగస్టు 2025



కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వరం ఆలయం వద్ద శ్రావణ శనివారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణమాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఏర్పాట్లు చేశారు. అలాగే శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని కాళేశ్వరంలో నవగ్రహ పూజలు, కాలసర్ప దోష నివారణ పూజలు జరిగాయి.

దంచికొట్టిన వాన



నిండుకుండలా లక్నవరం సరస్సు

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- రహదారులపైకి చేరిన వరద నీరు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- ములుగు జిల్లా సగటు వర్షపాతం 10.57 సెం.మీ
- అత్యధికంగా గోవిందరావుపేటలో 21.76 సెం.మీ

ములుగు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో వర్షం దంచికొట్టింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వరద నీరు రహదారులపె చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 95.18 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటు వర్షపాతం 10.57 సెం.మీ రికార్డు అయ్యింది. గోవిందరావుపేట మండలంలో అత్యధికంగా 21.76 సెం.మీ వర్షం కురవగా అత్యల్పంగా కన్నాయిగూడెం మండలంలో 4.42 సెం.మీ నమోదైంది. మంగపేట మండలంలో 13.64, వెంకటాపురం 11.20, ములుగు మండలం 10.90, వెంకటాపూర్ 10.16, ఏటూరునాగారం 8.84, వాజేడు 7.26, తాడ్వాయి 7 సెం.మీ వాన పడింది. భారీ వర్ష ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా జలకళ సంతరించుకుంది. చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు చేడరంతో సమీప ప్రాంతాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. సమ్మక్క బ్యారేజీలోకి వరద ఉధృతి కొనసాగుతోంది. 59 గేట్లకు గాను అన్నింటినీ తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

జిల్లాలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రధానంగా తాడ్వాయి మండలంలోని జంపన్న వాగు పొంగి పొర్లుతోంది. దీంతో పరీవాహక ప్రాంతాలైన నార్లాపూర్, గోనెపల్లి, మేడారం, రెడ్డిగూడెం, ఊరట్టం, కాల్వపల్లి గ్రామాల రైతుల పంట పొలాలు నీటమునిగాయి. ఊరట్టం సమీపంలోని తుమ్మల వాగు పొంగి బ్రిడ్జి పైనుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. మంగపేట మండలంలోని ఎర్రవాగు, గౌరారం వాగు, మల్లూరు వాగు, చుంచుపల్లివాగు, ముసలమ్మ వాగు వరదలతో ఉరకలేస్తున్నాయి. బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారి అక్కడక్కడ కోతకు గురైంది. కొత్తపేట గ్రామంలోని నాలుగు ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాన్నాయిగూడెం మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వర్షపునీరు రోడపైకి చేరడంతో ఐలాపూర్ గ్రామానికి రవాణా స్తంభించింది. బుట్టాగూడెం గ్రామంలో పెంకుటిల్లు నేలమట్టమైంది. గోవిందరావుపేట మండలంలో లక్నవరం సరస్సు మత్తడి పోస్తోంది. రహదారిపైకి వరదనీరు చేరడంతో పస్రా-మేడారం రహదారి రాకపోకలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. వెంకటాపురం మండలంలోని కంకలవాగు, జిన్నెలవాగు, కుక్కతోగు వాగు పాలెవాగు, పెంకవాగులు ఉధృతంగా ప్రవహిసున్నాయి. ఏటూరునాగారంలో జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వాజేడు మండలంలో గుండ్లవాగు ప్రాజెక్ట్ అలుగు పోస్తోంది. బొగత ఉగ్రరూపం దాలుస్తోంది. ఇదిలా ఉండగా గోదావరి స్వల్పంగా పెరుగుతూ వస్తోంది. ములుగు మండ లంలో బండారుపల్లి శివారులో గల రాళ్లవాగు వరద ప్రవహిస్తోంది. వెంకటాపూర్ మండలంలో లింగాపూర్ వెళ్లే రహ దారిలోని సుద్ద వాగు పొంగి రోడ్డుపైకి వర్షపు నీరు చేరింది. జిల్లాలోని కన్నాయిగూడెం, వాజేడు, ఏటూరునా గారం, మంగపేట మండలాల్లో గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. కడెం ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవ డంతో ఆ వరదనీరు ములు గు జిల్లాలోని గోదావరి వైపు వస్తున్నట్లు అధికారులు తెలి పారు. ఆదివారం తెల్లవారేసరికి మరింత ప్రవాహం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ప్రజలు వాగులు దాటి వెళ్లొద్దు : కలెక్టర్ దివాకర

ములుగు జిల్లాలో రానున్న మరో నాలుగు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులను కలెక్టర్ దివాకర అప్రమత్తం చేశారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని అన్నారు. ఇళ్లు కూలే పరిస్థితి ఉన్న వారు బంధువుల ఇళ్లకు గానీ తాము ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఆయన కోరారు. వాగులు, వంకలను దాటొద్దని సూచించారు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వం కల్పించిన వసతుల్లోకి వెళ్లాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని కోరారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తాకొద్దని సూచించారు. వరద ప్రవాహం వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది సలహాలను, సూచనలను పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 100ను సంప్రదించాలన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న మేడారం వద్దనున్న జంపన్నవాగు

రాత్రిపూట కుండపోత



రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న గొర్లవీడు వాగు

- భూపాలపల్లి జిల్లాలో ఉప్పొంగిన చెరువులు, కుంటలు
- నీట మునిగిన పంటలు
- పలు చోట్లా రాకపోకలకు అంతరాయం

కృష్ణకాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 56.6 మి.మీ నమోదైంది. అత్యధికంగా మహాముత్తారం మండలంలో 105.8 మి.మీ వర్షపాతం రికార్డు అయ్యింది. అత్యల్పంగా కొత్తపల్లిగోరి మండలంలో 15.2 మిల్లీ మీటర్ల నమోదైంది. మహదేవపూర్‌లో 36.2, పలిమెలలో 91.6, కాటారం 36.2, మల్హర్ 55.6, చిట్యాల 27.4, టేకుమట్లలో 29.2, మొగుళ్లపల్లిలో 29.0, రేగొండలో 52, గణపురంలో 62.4, భూపాలపల్లిలో 97.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కారణంగా జిల్లాలో పంట పొలాలు పర్తిగా నీట మునిగాయి. అన్ని మండలాల్లో చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. భూపాలపల్లి మండల పరిధిలో ఉన్న మోరంచవాగు నీటిమట్టం పెరిగి బ్రిడ్జి అంచుకు నీరు చేరుకున్నాయి. అలాగే, భూపాలపల్లి మండలం గొర్లవీడు రహదారిలో ఉన్న చెరవు ఉప్పొంగడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు మహాముత్తారం మండలంలో జోరు వాన కురిసింది. మేడారం వెళ్లే దారిలో పెద్దవాగు పొంగిపొర్లింది. దీంతో మహాముత్తారానికి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే, లోలెవల్ కల్వర్టులు సైతం ఉధృతంగా ప్రవహించాయి. ఓసీ-2, ఓసీ-3లో పూర్తిగా వర్షపు నీరు నిలిచిపోవడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. బొగ్గు వెలికి తీత సాధ్యపడలేదు. సంస్థకు సుమారు ఒక్క రోజే రూ.3 కోట్లు నష్టం వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.

నీట మునిగిన పంటలు

ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో జిల్లా కేంద్రంతోపాటు వివిధ మండలాల్లోని వరి, పత్తి పంటలు పూర్తిగా నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా వరి 1,12,000 ఎకరాల్లో సాగు అంచనా ఉండగా ఇప్పటి వరకు సుమారు 67 వేల ఎకరాల్లో పూర్తయ్యింది. ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాలతో సాగు పనులు సైతం ముమ్మరం కానున్నాయని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 98వేల ఎకరాల్లో పత్తి పంట వేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, ఈ వర్షాల కారణంగా పంటలు నీట మునిగితే పెద్దగా నష్టమేమీ ఉండదని అంటున్నారు. వర్షపునీరు వెళ్లిపోయాక పంటలు మళ్లీ యధాస్థితికి చేరుకుంటాయని తెలిపారు. ఇప్పటి వరకైతే జిల్లాలో పంట నష్టమేమి నమోదు కాలేదంటూ వారు స్పష్టం చేశారు. ఇక సింగరేణికి వర్షం నష్టాన్ని చేకూరుస్తూనే ఉంది. ఓసీ-2, ఓసీ-3లో పూర్తిగా వర్షపు నీరు నిలిచిపోవడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. బొగ్గు వెలికి తీత సాధ్యపడలేదు. సంస్థకు సుమారు ఒక్క రోజే రూ.3 కోట్లు నష్టం వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.

ఇళ్లలోకి నీరు.. ఎమ్మెల్యే పరిశీలన

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీ, ఎల్‌బీనగర్‌కాలనీలో గత (మిగతా 8లో)

ప్రకాశ్‌రెడ్డిని పరామర్శించిన మంత్రి వివేక్



ప్రకాశ్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి వివేక్

మల్హర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం పరామర్శించారు. ప్రకాశ్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఆయన్ను పరామర్శించిన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వల్లెంకుంట గ్రామంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి సహకరించాలని మంత్రి వివేక్‌ను మాలమహానాడు నేతలు కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. రూ. 15 లక్షల మంజూరు చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. మంత్రి వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, నాయకులు దేవి భూమయ్య, ప్రేమ్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

పరవళ్లు తొక్కుతున్న బొగత



బొగత అందాలను వీక్షిస్తున్న సందర్శకులు



వాజేడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని తెలంగాణ నయాగరా బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. భారీ వర్షాలతో శనివారం భారీగా వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. కొండలు, గుట్టలు, వాగుల నుంచి వస్తున్న నీరుతో ప్రవాహం పెరిగింది. హోరున శబ్దం చేస్తూ ఉవ్వెత్తున జలధారలు కిందకు దుంకుతోంది. ఈ జలదృశ్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వరుస సెలవులు రావటంతో సందర్శకులు భారీగా తరలిచ్చి బొగత అందాలను వీక్షిస్తున్నారు. సుమారు 4వేలకు పైగా పర్యాటకులు సందర్శించారని అంచనా. గత రాత్రి కురిసిన వ ర్షంతో బొగతకు ప్రవాహం పెరగటంతో సందర్శకుల ను నీటి కొలనులోకి అధికారులు అనుమతించడం లేదు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కాటారం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కాటారం గ్రామంలో చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లోంచి విలువైన సొత్తును దొంగలు అపహరించారు. ఎస్సై శ్రీనివాస్ శనివారం వివరాలు వెల్లడించారు. కాటారం గ్రామంలో బొమ్మన నిర్మల-సత్తయ్య దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. సత్తయ్య తీవ్ర అనారోగ్యం బారిన పడగా చికిత్స నిమిత్తం గత నెల 15న హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స తీసుకుంటూ అక్కడే ఉన్న కూతురు ఇంట్లో ఉంటున్నారు. శనివారం కాటారంలో ఉంటున్న సత్తయ్య అన్న కొడుకు దామోదర్ ఎద్దులను పెరట్లో కట్టేయడానికి వెళ్లగా సత్తయ్య ఇంటి తలుపు తాళం పగులగొట్టి కనిపించింది. దీంతో అతడు పిన్ని నిర్మల, బాబాయి సత్తయ్యకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో హుటాహుటిన నిర్మల సాయంత్రంలోగా ఇంటికి చేరింది. ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని సుమారు రూ.61వేల విలువ చేసే బంగారు చెవి దుద్దులు (అర తులం), వెండి పట్టీలు చోరీకి గురైనట్లు గమనించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు.

సింగరేణి సీఎండీతో గిరిజన ఉద్యోగుల సంఘం భేటీ

కృష్ణకాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం నాయక్‌ను సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం కేంద్ర కమిటీ ప్రతినిధులు శనివారం భేటీ అయ్యారు. ఇటీవల ఈ కార్యవర్గం ఎన్నికల జరగ్గా సీఎండీని కమిటీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల రమేష్, ప్రధాన కార్యదర్శి భూక్య కృష్ణమూర్తితోపాటు సభ్యులు పాల్గొన్నారు. అలాగే, డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రును కూడా కమిటీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు.



సింగరేణి సీఎండీకి వినతి పత్రాన్ని అందిస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కాటారంలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు, నాయకులు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్, పలిమెల మండలాల వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. మహదేవపూర్ మండలంలోని రాపల్లికోట గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు పంచిక వెంకటస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో యాదవ కులసుకథలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నైన్‌పాకలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ పరమహంస మందిరం నుంచి శ్రీకృష్ణుడి విగ్రహం, చిత్రపటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామ శివారులోని శ్రీ నాపాక లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకోగా ఆలయం ప్రధాన అర్చకులు ప్రభాకరాచార్యులు ప్రత్యేక పూజలు జరిపించారు. చిన్నారులతో ఉట్టి కొట్టించి బహుమతులు అందించారు. చైర్మన్ యాదండ్ల రాజయ్య, యాదవ సంఘం బాధ్యులు జంగ కుమార్, నక్క భాస్కర్, మాజీ ఎంపీటీసీ కట్టెకోళ్ల రమేష్, రాజు, కావటి కొమురయ్య, యాదండ్ల మహేష్, తొట్ల రవి, గొర్రె అనీల్, బావు గట్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు
- కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గారెపల్లి అభయాంజనేయ స్వామి ఆలయంలో యాదవ సంఘం యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పురవీధుల మీదుగా ఊరేగించగా మహిళలు ఎదురేగి హారతులిచ్చారు. అఖిల భారత యాదవ సంఘం యూత్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని దేవరాంపల్లి జడ్పీహెచ్ఎస్ మైదానంలో యూత్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా సాగింది. వివిధ పార్టీల నాయకులు, యువకులు హాజరై ఉట్టి కొట్టడానికి ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు తోట జనార్దన్, కొట్టె శ్రీహరి, నాయిని శ్రీనివాస్, చీమల రాజు, దోమ రాహుల్, నవీన్‌రావు, కిసాన్ సెల్ జల్లా అధ్యక్షుడు వొన్న వంశవర్ధన్‌రావు, ఏఎంసీ డైరెక్టర్ పిల్లమారి రమేష్, యాదవ సంఘం యూత్ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, నిర్వాహకులు, అనిల్, శివ, మనోజ్, మురారి, రతీష్ తదితరులు పాల్గొన్నారు.
- మల్హర్(ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు కృష్ణ, గోపిక వేషధారణలు వేయించారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కొట్టె కార్యక్రమం నిర్వహించారు.
- టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యాదవ సంఘం మండల కమిటీ అధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా లఘు పూజ, భక్తులతో సాముహిక ఆఖండ పూజ నిర్వహించి అనంతరం టేకుమట్ల నుంచి రామకిష్టాపూర్ (టి) వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. గెలుపొందిన యువకుడికి రూ.1016, మహిళకు రూ.1016, పిల్లలకు రూ.516 పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు మాదం కొంరయ్య, ఉపాధ్యక్షులు తోడేటి కుమార్, దాసరి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శులు కుర్రె మల్లయ్య, అమ్ముల కుమార్, కార్యదర్శి మద్దెల కుమార్, (మిగతా 8వ పేజీలో)



మంగపేట మండలం కమలాపురం రామాలయంలో చిన్నారులతో వాయిలాలు చేయిస్తున్న నిర్వాహకులు

'మేడిగడ్డ'కు పెరుగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం పెరుగుతోంది. రెండు రోజులుగా ఇన్‌ఫ్లో నెమ్మదిగా పెరుగుతూ వస్తోంది. శనివారం బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 3.73లక్షల క్యూసెక్కులుగా నమోదు కాగా మొత్తం గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 5 మీటర్ల ఎత్తులో గోదావరి నది ప్రవహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

యూరియా కోసం తిప్పలు

● బారులు తీరిన రైతులు

గూడూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు ఏజెన్సీ మండలంలో యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. మండలంలో 42 గ్రామాలకు గాను మండల కేంద్రంలో ఒకటే సొసైటీ ఉండంతో మండలంలోని రైతులు యూరియా కోసం సొసైటీకి వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. యూరియా కోసం రైతులు సొసైటీ వద్ద తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా బస్తాలు లభించగా మరికొంతమంది రైతులకు యూరియా బస్తాలు దొరకకపోవడంతో వారు నిరాశతో ఇంటిదారి పట్టారు. తమకు సరిపడా యూరియాను అందించడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు యూరియా ఉందని, ఎవరు ఆందోళన చెందవద్దని ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ.. మేము యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, మరోపక్క వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ.. రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేసుకోవద్దన్నారు. రైతులందరికి సరిపడ యూరియా అందేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు భరోసా కల్పించారు. గత సంవత్సరం ఖరీఫ్, రబీకి గాను 76 వేల బస్తాల యూరియా పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు ప్రస్తుతానికి 17 వేల బస్తాలను పంపిణీ చేసినట్లు చెప్పారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



కొండయ్య(ఫైల్)

పెద్దవంగర, ఆగష్టు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పోచంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. శనివారం ఎస్సై క్రాంతికిరణ్ వివరాల ప్రకారం.. మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన సూదగాని కొండయ్య (48) తనకు ఉన్న ఐదు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారి వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లిన కొండయ్య తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు అనుమానంతో వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి చూసే సరికి బావిలో మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సూదగాని స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

మత్తడిపోస్తున్న లక్నవరం చెరువు

● గోవిందరావుపేట మండలంలో కుండపోత
● పస్రా-నార్లాపూర్ దారిలో పొంగిన యాసంగితోగు
● రాకపోకలను నిలిపివేసిన పోలీసులు



లక్నవరం మత్తడిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు



నిండుకుండలా మారిన లక్నవరం చెరువు

గోవిందరావుపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో వర్షం కుండపోతగా కురిసింది. శుక్రవారం అర్రాత్రి దాటిన తర్వాత ఆకాశానికి చిల్లులు పడ్డట్టు కుంభవృష్టి పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అత్యధికంగా 217.6 మి.మీ వర్షం కురిసింది. ఉదయం 8గంటల తర్వాత వర్షం ఆగినప్పటికీ వాగులు ఉగ్రరూపం దాల్చాయి. తాడ్వాయి మండలం మేడారం వేళ్లే పస్రా-నార్లాపూర్ దారిలో బాంబుల మోరీ వద్ద యాసంగితోగు రోడ్డుపై ఉధృతంగా ప్రవహించింది. దీంతో అప్రమత్తమైన పస్రా ఎస్సై కమలాకర్ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. బారికేట్లను ఏర్పాటు చేశారు. నార్లాపూర్ వైపునకు వాహనాలు వెళ్లకుండా నిలిపివేశారు. తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో మమత, నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్ రాఘవపట్నం, ముత్తాపూర్, పస్రానాగారం బ్రిడ్జిల వద్ద దయ్యాలవాగు ప్రవాహాన్ని పరిశీలించారు. రోడ్లపై నీటి ప్రవాహం తగ్గేంతవరకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ప్రజలకు సూచించారు. దయ్యాలవాగు పరివాహకంలోని నివాసాలలోకి నీరుచేరే అవకాశముండటంతో స్థానికులను అప్రమత్తం చేశారు. వడ్డెరవాడ, ఎస్సీ కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని, మరో నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందని సూచించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు.

- మత్తడి దుంకుతున్న లక్నవరం

మండలంలోని బుస్సాపూర్ పంచాయతీ పరిధిలోగల లక్నవరం చెరువు శనివారం సాయంత్రం నుంచి మత్తడి పోస్తోంది. 34ఫీట్ల నిల్వ సామర్థ్యం కలిగిన చెరువులోకి 33.6ఫీట్ల నీరు చేరింది. దీంతో మత్తడి నుంచి స్వల్పంగా నీరు జారుతోంది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండగా ఆదివారం నాటికి మత్తడి ప్రవాహం పెరగనుంది. ఈ సీజన్‌లో లక్నవరం మత్తడి పోయడం ఇదే మొదటిసారి.

హేమాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



హేమాచల క్షేత్రం గర్భగుడి వద్ద భక్తుల రద్దీ

మంగపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం సందడి కనిపించింది. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. సుమారు 19 వేల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి కొండకు చేరుకున్నారు. చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలోని ఉప దేవాలయాల వద్ద దేవుళ్లను దర్శించుకున్నారు. అనంతరం కొండపై కొలువైన స్వయంభు పుట్టుస్వామిగా విరాజిల్లుతున్న లక్ష్మీనరసింహస్వామితో పాటు ఆదిలక్ష్మి చెంచులక్ష్మి దేవతలను భక్తులు ముందుగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ, విశ్రాంతి అర్చకుడు కైంకైర్యం రామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, అనిపెద్ది మురళీకృష్ణశర్మ, వెంకటనారాయణశర్మ స్వామివారి మూలవిరాట్టుకు తిలా, తైలాభిషేకాలు నిర్వహించారు. గజమాలతో సుందరంగా అలంకరించి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థప్రసాదాలను అందజేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.గీతాంజలి నరేశ్

అరుదైన కిడ్నీ సర్జరీ

యూరాలజిస్టు డాక్టర్ గీతాంజలి నరేశ్

వరంగల్ మెడికల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పూర్తి గుండె వైఫల్యం, దీర్ఘకాలిక మూత్రపిండ వైఫల్యం ఉన్న రోగికి అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు బాలసముద్రంలోని అంజలి కిడ్నీ కేర్, రీసెర్చ్ సెంటర్ యూరాలజిస్టు డాక్టర్ కె.గీతాంజలి నరేశ్, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నరేశ్ సముద్రాల శనివారం తెలిపారు. సీరం క్రియాటిన్ 6.8తో ఉన్న హైరిస్క్ సర్జికల్ ఇంటర్వెన్షన్ రోగికి యూఆర్ఎస్ఎల్ సర్జరీతో పాటు ద్వైపాక్షిక డీజే సెట్టింగ్ చేసినట్లు తెలిపారు. ఇదే రోగి ఈ చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లగా సర్జరీ చేయడం కుదరదని చెప్పగా మరో ఆస్పత్రి వారు రూ.3లక్షల 50 వేలు ఖర్చు అవుతుందని తెలుపడంతో నిరాశ చెందిన రోగి చివరకు తమ ఆస్పత్రిని సందర్శించినట్లు పేర్కొన్నారు. తాము మనోధైర్యం కల్పించి కేవలం రూ.60వేలకే ఈ శస్త్ర చికిత్సను పూర్తి చేశామన్నారు. అనస్తీషియా డాక్టర్ సాగర్, థియేటర్ అసిస్టెంట్ నరేశ్, శ్రీకాంత్ పాల్గొన్నట్లు తెలిపారు.

ఉన్నత చదువులే లక్ష్యంగా ముందుకు సాగాలి

సింగరేణి సీఎండీ బలరాంనాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న బలరాంనాయక్

గార్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత చదువులే లక్ష్యంగా ముందుకు సాగాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం నాయక్ అన్నారు. శనివారం గార్ల మండల కేంద్రంలో బీఎస్ఎస్ అనాథ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగాన్ని వదులుకొని గిరిజన తండాల్లో చదువుకు దూరమవుతున్న అనాథ విద్యార్థులను చేరదీసి కార్పొరేట్ స్థాయిలో విద్యా నేర్పుతున్న బీఎస్ఎస్ సంస్థ వ్యవస్థాపకుడు తేజావత్ జోగిరాంనాయక్ సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత చదవులు చదివి సమాజాభివృద్ధి పాటుపడాలన్నారు.

అనంతరం సీహెచ్‌సీ ఆసుపత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వసతులను అడిగి తులుసుకున్నారు. పేదలకు ఉపయోగ పడే శవపంచనామా గది, ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్ సౌకర్యం కల్పనకు సిగరేణి సంస్థ నుంచి నిధులు విడుదలకు కృషి చేయాలని డాక్టర్ రాజ్ కుమార్‌జాదవ్ బలరాంనాయక్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన సానుకులంగా స్పందించి మంజూరుకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యుత్ స్తంభాలు తొలగించాలని నిరసన



పెట్రోల్ బాటిల్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న కుటుంబం

జనగామ రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఓ రైతు కుటుంబం పెట్రోల్ బాటిల్‌తో నిరసన వ్యక్తం చేసిన ఘటన జనగామ జిల్లా జనగామ మండలంలో చోటు చేసుకుంది. శామిర్‌పేటకు చెందిన రైతు జిట్టె శ్రీనివాస్ కుటుంబం తమ పొలం గుండా విద్యుత్ లైన్లు వేయొద్దంటూ శనివారం తన పొలం వద్ద రోడ్డుపై పెట్రోల్ బాటిల్‌తో నిరసన చేపట్టారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే తమ పొలంలో చాలా విద్యుత్ స్తంభాలున్నాయని, వాటిని తొలగించాలని అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. రైతు నిరసనకు స్పందించిన అధి కారులు శ్రీనివాస్ పొలం నుంచి కాకుండా పక్క నుంచి కరెంటు పోల్స్ వేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

జిన్నెల వాగుపై వరద ప్రవాహం

● మహబూబాబాద్-ఇల్లెందు రోడ్డులో నిలిచిన రాకపోకలు



ఇల్లెందు ప్రధాన రహదారిలో నిలిచిన రాకపోకలు

బయ్యారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బయ్యారం మండలం నామాలపాడు సమీప జిన్నెల వాగు వరద ప్రవాహంతో మహబూబాబాద్-ఇల్లెందు ప్రధాన రహదారిలో రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో బయ్యారం పెద్ద చెరువులోకి వరద ఉధృతి పెరిగిన సంగతి తెలిసిందే. దీంతో అలుగు ద్వారా వస్తున్న వరద జిన్నెల వాగుపై నుంచి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జిపై నుంచి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఇరువైపుల వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పోలీస్, రెవెన్యూ అధికారుల బృందం ఘటన స్థలికి చేరుకొని పరిస్థితి సమీక్షిస్తున్నారు. వరద ఉధృతి అధికమయ్యే పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులను ప్రత్యామ్నాయ మార్గాల్లో తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. కాగా, కొంత మంది ప్రయాణికులు ట్రాక్టర్ల సహాయంతో వాగు దాటుతున్నట్లు సమాచారం.

50 ఏళ్లు పైబడిన వారికి ఉచిత ఓపీ

నెఫ్రాన్ కిడ్నీ సెంటర్ యూరాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర ప్రదీప్



సర్జరీ చేస్తున్న రాఘవేంద్ర ప్రదీప్

వరంగల్ మెడికల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ, మూత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 50 ఏళ్ల వయస్సు పైబడిన వారికి ఉచిత ఓపీ సౌకర్యం అందిస్తున్నట్లు హనుమకొండ విజయ టాకీస్ రోడ్‌లోని రంగా రావు కాంప్లెక్స్‌లో ఉన్న నెఫ్రాన్ కిడ్నీ సెంటర్ యూరాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర ప్రదీప్ తెలిపారు. 8ఏళ్లుగా సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలో మొట్టమొదటిసారిగా అత్యాధునిక సాంకేతికతతో కిడ్నీలోని రాళ్లను తొలగిస్తున్నామని, లేజర్ సర్జరీలు, కోత, స్టంట్, గాటు, మత్తు లేకుండా తక్కువ ఖర్చుతో సర్జరీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సర్జరీలు డేకేర్ సర్జరీలుగా ఉంటాయని తెలిపారు. చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్ద వారందరికీ మూత్రపిండాల సమస్యలకు ఒకే చోట చికిత్స అందిస్తున్నామని, అతి తక్కువ ఖర్చుతో ఇప్పటికే 2500 పైగా లేజర్ సర్జరీలు నిర్వహించామన్నారు.

ప్రోస్టేట్ సం బంధిత సమస్యలు, 100 వాట్స్ హైపవర్ లేజర్ మిషన్ తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. యూరో ఆంకాలజీ, పీడియాట్రిక్ యూరాలజీ లాంటి సౌకర్యాలు కూడా తమ ఆస్పత్రిలో ఉన్నాయని ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర ప్రదీప్ తెలిపారు.

ఇంటర్‌నేషనల్ సిరీస్‌కు అంపైర్‌గా కొమ్ము రాజేందర్




కేసముద్రం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈనెల 19 నుంచి 24 వరకు నిర్వహించే పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరగనున్న 'కోటక్ ఇండియా జూనియర్ ఇంటర్‌నేషనల్ సిరీస్-2025' బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలకు అంపైర్‌గా కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ పీడీ కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఎం.జితేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, డా.పింగిళి రమేష్‌రెడ్డిలు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ పోటీల్లో ప్రపంచ అగ్రశ్రేణి జూనియర్ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బందెల రాజు, అసోసియేషన్ బాధ్యులు రాజేందర్‌ను అభినందించారు.

బొగత సందర్శన బంద్

వాజేడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని బొగత జలపాత సందర్శనను నిలిపివేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు శనివారం సాయంత్రం ప్రకటించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలపాతానికి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి తెలిపారు. వాజేడు మండలం బొగతతో పాటు వెంకటాపురం ఫారెస్టు డివిజన్ పరిధిలోని అన్ని జలపాతాలకు ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. సందర్శకులు తమ పర్యాటనను వాయిదా వేసుకోవాలని సూచించారు.

అమ్మకు అమ్మనై చిత్ర కవితా సంకలనంలో కుమార్‌కు చోటు



కుమారస్వామి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ కూకట్‌పల్లి సుందరయ్య కళాభవనంలో ఈ నెల 10న డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో నిర్వహించిన కవితా సంకలనంలో కవి, రచయిత చింతకుంట్ల కుమారస్వామి రచించిన చిత్ర కవితా సంకలనం అమ్మకు అమ్మనై ఎంపికైంది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన కవి, రచయిత, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చింతకుంట్ల కుమారస్వామి కవితా సంకలనం ఎంపిక కావడం సంతోషకరమని పలువురు కవులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయికి 90 మంది కవితలను ఎంపిక చేయగా అందులో కుమారస్వామి కవిత ఎంపిక కావడం పట్ల పట్టణానికి చెందిన కవులు, రచయితలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇంటి గుంతలో పడి..

6 ఏళ్ల బాలుడు మృతి.. చిన్నారి సురక్షితం

● మహబూబాబాద్ జిల్లాలో ఘటన

బయ్యారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ గుంతలో పడి 6 ఏళ్ల బాలుడు మృతి చెందిన విషాద ఘటన శనివారం బయ్యారం మండలం జగత్‌రావుపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. జగత్‌రావు పేట గ్రామానికి చెందిన వాంకుడోత్ జీవన్-మహాలక్ష్మి దంపతులకు ఇరువురు సంతానం. 6 ఏళ్ల బాలుడు చక్రీతో పాటు 4 ఏళ్ల ఆకాశ్ ఉన్నారు. అదే విధంగా తేజావత్ సురేష్-మంజుల దంపతులకు కూడా ఇరువురు సంతానం. నాగేశ్వరితో పాటు 4 ఏళ్ల చిన్నారి ప్రజ్ఞ ఉన్నారు. అయితే జీవన్ దంపతుల 6 ఏళ్ల బాలుడు చక్రీ, సురేష్ దంపతుల 4 ఏళ్ల చిన్నారి ప్రజ్ఞలు ఆడుకుంటూ, ఆడుకుంటూ ఎదురుగాఉన్న తేజావత్ రోజాకు చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన పిల్లర్ గుంతలో ప్రమాదవశాత్తు పడిపోయారు.

రోజాకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 5 రోజుల క్రితం పిల్లర్ గుంతలు తీయించినట్లు తెలిసింది. అనంతరం కొద్ది రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గుంతలలో నీళ్లు నిలిచాయి. ఈ క్రమంలోనే పాసిపాపలు ఇరువురు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పిల్లర్ల కోసం తీసిన గుంతలో పడిపోయారు. ఇది గమనించిన స్థానికులు పిల్లలను రక్షించేందుకు గుంతలోంచి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం చిన్నారులు ఇరువురిని మహబూబాబాద్ తరలిస్తుంటే మార్గమధ్యంలో చక్రీ (6) మృతి చెందినట్లు తెలిసింది. ప్రజ్ఞను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా ప్రస్తుతం సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. కాగా ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. బాలుడు చక్రీ మృతితో జగత్‌రావు పేట గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.



హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఉన్న టౌన్ హాల్

శిథిల టౌన్‌షిప్

- మసకబారుతున్న పురాతన కట్టడం
- అద్దాలు పగిలిపోయిన తలుపులు, కిటికీలు
- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- పాకురు పట్టిన గోడలు, దెబ్బతింటున్న స్తంభాలు
- 101 సంవత్సరాల కిందటి భవనం
- కొంతకాలంగా మూసివేత
- వారసత్వ సంపదను కాపాడడంలో నిర్లక్ష్యం

హనుమకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని అత్యంత ప్రాచీన కట్టడమైన టౌన్‌హాల్ భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. వరంగల్ నగరపాలక సంస్థగానీ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థగానీ ఈ వారసత్వ సం పదను పట్టించుకోవడం లేదు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, రాష్ట్రావతరణ దినోత్సవం వంటి సందర్భాల్లో విద్యుత్‌దీపాలతో పైపైన అలంకరించడంతోనే సరిపెడుతున్నారు. దూరం నుంచి చూస్తే టౌన్ హాల్ బాగానే కనిపిస్తున్నా.. దగ్గరకి వెళితేగానీ దీనస్థితి, అసలు స్వరూపం తెలియదు. గతంలో టౌన్‌హాల్‌ను బాగానే చూసుకునేవారు. కొన్నేళ్లుగా దీని గురించి పట్టించుకోవడం మానేసినట్టున్నారు. నిర్వహణ సరిగా లేక క్రమంగా శిథిలమవుతోంది.



దెబ్బతింటున్న టౌన్‌హాల్ పిల్లర్

వందేళ్ల కిందట..

టౌన్‌హాల్‌ను నిర్మించి 101 ఏళ్లవుతోంది. భవనం గోడకున్న శిలాఫలకంలో పేర్కొన్న తేదీ ప్రకారం 1334 ఫస్లీ (1924) ఫిబ్రవరి 19న అప్పటి కలెక్టర్ ఎస్ఎం నయీమొద్దీన్ సాహిబ్ దీనికి శంకుస్థాపన చేశారు. మరో దిక్కున గోడకు ఇంకో శిలాఫలకం కూడా కనిపిస్తోంది. దీనిపై ఊర్దూలో రాసి ఉంది. హజ్రత్ నవీ, సంజ్ నిజాం మాలిక్ షా అనే ఇద్దరు దీనికి శంకుస్థాపన చేసినట్టు అందులో పేర్కొన్నారు. నిజాం కాలం నిర్మించిన ఈ టౌన్‌హాల్‌ను మొదట్లో మహబూబ్ బాగ్‌గా పిలిచేవారు. అప్పట్లో ఈ భవనాన్ని కొంత కాలం పాటు పరిపాలనా భవనంగా ఉపయోగించినట్టు తెలుస్తోంది. వరంగల్ పురపాలక సంఘం ఏర్పాటైన తర్వాత ఈ భవనం ఉన్న ప్రాంతాన్ని పబ్లిక్‌గార్డెన్‌గా మార్చి దీనికి టౌన్‌హాల్ అని పేరు పెట్టారు. హనుమకొండ నడిబొడ్డున ఉన్న ఈ ప్రాచీన కట్టడం వరంగల్ నగరానికే ఒక ల్యాండ్‌మార్క్‌గా నిలుస్తోంది. భవనాన్ని కుతుబ్‌షాహీల శైలిలో నిర్మించారు. భవనంలో విశాలమైన హాల్, దాని పక్కన కొన్ని గదులు, చుట్టూ వరండా నాలుగు వైపులా డోమ్‌లను నిర్మించారు. రాజప్రాసాదంగా కనిపించే ఈ భవనాన్ని పూర్తిగా డంగు సున్నంతో కట్టారు. ఇనుప బీముల సాయంతో పైకప్పును ఏర్పాటు చేశారు.




అద్దాలు ధ్వంసమైన దర్వాజలు



పాకురు పట్టిన గోడ

శిథిలావస్థలో..

కట్టడం ఇప్పటికీ పటిష్టంగానే ఉన్నది. నిర్వహణ సరిగా లేకపోవడంతో క్రమంగా దెబ్బతింటోంది. పైకప్పు పెచ్చులూడుతోంది. ఇనుప బీములు తుప్పుపట్టి బయటికి కనిపిస్తున్నాయి. స్తంభాలు పగుళ్లు ఏర్పడి దెబ్బతింటున్నాయి. వర్షపు నీరు కారుతుండడం వల్ల పాకురు పట్టి గోడలు దెబ్బతింటున్నాయి. భవనం చుట్టూ ఉన్న తలుపులు, కిటికీల అద్దాలు పగిలిపోవడంతో వాటిని అట్టచెక్కలతో మూసి వేసారు. తలుపులకు ఉన్న జాలీలు ధ్వంసం అయ్యాయి. పబ్లిక్ గార్డెన్‌కు వచ్చినవారు గోడలపై బొగ్గు, పెన్సిల్, పెన్నులతో పిచ్చిరాతలు రాయడంతో వికృతంగా కనిపిస్తున్నాయి. సున్నం వేయక చాలా రోజులు అయినందువల్ల గోడలపై పెచ్చులు రాలుతున్నాయి. హాల్‌ను స్టోర్ రూమ్‌గా మార్చేశారు. వీధి దీపాలకు సంబంధించిన విద్యుత్ వైర్లు, లైట్లు, ఇతరత్రా పరికరాలు, సౌండ్ బాక్సులు ఇతరత్రా సామానులతో నింపేశారు. దీంతో హాల్ అంతా దుమ్ముపట్టి, చెత్తచెదారం పేరుకుపోయి దెబ్బతింటోంది. టౌన్‌హాల్ నాలుగువైపులా డోమ్‌ల కింద ఉండే చిన్నపాటి గదులను కూడా సామానులతో నింపేశారు. సందర్శకులు పాన్‌ను నమిలి ఉమ్మి వేడయంతో గోడమూలలు అసహ్యంగా కనిపిస్తున్నాయి.



పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

టౌన్‌హాల్ మూసివేత

గతంలో టౌన్‌హాల్‌లో ఏదో ఒక కార్యక్రమం జరుగుతూ సందడిగా కనిపిస్తోంది. చేనేత వస్త్రాలు, చేతి ఉత్పత్తులు, పుస్తకాల ప్రదర్శన వంటివి ఇందులో నిర్వహించేవారు. ఆర్ట్ ఎగ్జిబిషన్లు కూడా జరుగుతుండేవి. సాంస్కృతిక పోటీలను, సాహిత్య కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుండేవారు. పంద్రాగస్టు, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పండుగలు జరిగినప్పుడు ఛాయా చిత్ర ప్రదర్శనలు కూడా ఇందులోనే నిర్వహించేవారు. ఇతర రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు కూడా అడపాదడపా జరుగుతుండేవి. టౌన్‌హాల్‌ను మూసివేయడంతో ఇప్పుడు అలాంటివేవి ఇందులో జరగడం లేదు. దీనితో పర్యవేక్షణ కొరవడి టౌన్‌హాల్ భవనం శిథిలమవుతోంది.

పట్టించుకోని కుడా, కార్పొరేషన్

రూ.10కోట్లకు పైగా ఖర్చుచేసి పబ్లిక్‌గార్డెన్‌ను అభివృద్ధి చేసిన కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ.. వారసత్వ సంపద అయిన టౌన్ హాల్‌ను మాత్రం పట్టించుకోలేదు. గతంలో బల్దియా కమిషనర్లుగా పని చేసిన ఒకరిద్దరు టౌన్‌హాల్ పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన కమిషనర్లు ఎవరూ దీని వంక కన్నెత్తి చూడడం లేదు. 130 ఏళ్ల నాటి కలెక్టర్ బంగ్లాను రూ.2కోట్ల వ్యయంతో ఇటీవల పునరుద్ధరించిన కుడా.. టౌన్‌హాల్‌కు కూడా తగిన మరమ్మతులు చేసి ఈ వారసత్వ సంపదను కాపాడాలని నగరవాసులు కోరుతున్నారు. వందేళ్లకు పైబడిన టౌన్‌హాల్ గత చరిత్రకు సాక్షీభూతం. నిజాం పాలనకు ప్రత్యక్ష సాక్ష్యం. నగరంలోని అపురూప వారసత్వ కట్టడాల్లో ఒకటి. దీనిని పరిక్షరించాల్సిన బాధ్యత కుడా, కార్పొరేషన్‌కు ఉందని ప్రజలు కోరుతున్నారు. తగిన మరమ్మతులు చేసి పూర్వవైభవాన్ని తిరిగి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. హాల్‌లోని సామానులను తొలగించి నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరిగేలా చూస్తే టౌన్‌హాల్‌కు పూర్వవైభవం వస్తుందని అభిప్రాయపడుతున్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగింతలో తాత్సారం

ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఐదుగురి ఎంపిక

బాలసముద్రం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియామకమైన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను టీజీపీఎస్సీ ద్వారా ఎంపిక చేసి ఉద్యోగాల్లో నియమించారు. గత సంవత్సరం డిసెంబరులో ఖాళీగా ఉన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు పోస్టింగ్ ఇచ్చింది. ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులకు 45 రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చింది. గత మే 7న శిక్షణ పూర్తి చేసిన ఉద్యోగులకు ఆహార తనిఖీల బాధ్యతలు అప్పగించక పోవడం విస్మయం కలిగిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఐదుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను కేటాయించగా అందులో హనుమకొండ జిల్లాకు ఒకరు, వరంగల్ జిల్లాకు ఇద్దరు, మహబూబాబాద్ జిల్లాకు ఒకరు, జనగామ జిల్లాకు మరొకరు ఖాళీగా ఉన్న స్థానాలకు కేటాయించారు. ఉద్యోగాల్లో చేరిన వారికి ఇంత వరకు ఆహార పదార్థాలను తనిఖీ చేయడానికి అధికార బాధ్యతలు అప్పగించలేదు. అంతేగాక ఉమ్మడి వరంగల్ జిల్లాకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న అధికారి సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన ఎప్పుడో ఒకసారి అడపాదడపా వచ్చి వెళ్తుండగా ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఆహార వ్యాపారులపై పర్యవేక్షణ లేకుండా పోయింది.

అసలు జిల్లాలో ఆహార నియంత్రణ శాఖ పనిచేస్తుందా ? లేదా ? అన్న సందిగ్ధత నెలకొంది. దీంతో వ్యాపారులు తాము ఆడిందే ఆట పాడిందే పాటగా యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు, శుచీశుభ్రతలేని పదార్థాల తయారీ, విక్రయాలతో ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై చొరవ తీసుకొని నూతనంగా నియమితులైన ఉద్యోగులకు ఆహార పదార్థాల తనిఖీ బాధ్యతలను అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

ఏడేళ్ల ఎడారి జీవితం సుఖాంతం

- ఎట్టకేలకు సౌదీ నుంచి స్వగ్రామానికి ఈశ్వర్
- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ

భీమదేవరపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాళ్లపల్లి ఈశ్వర్ 2017లో సౌదీ అరేబియాకు వలస వెళ్లాడు. ఏడేళ్లుగా అక్కడ ఒక ఖర్జూర తోటలో చిక్కుకుపోయాడు. ఈశ్వర్ భార్య తాళ్లపల్లి లత, ఇద్దరు కూతుళ్లతో కలిసి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సీఎం ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు గత జూన్ 27న వినతిపత్రం అందజేశారు. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్‌చైర్మన్ మంద భీంరెడ్డి స్వయంగా వెంట ఉండి వారికి మార్గనిర్దేశం చేశారు. సీఎం ప్రజావాణి నోడల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి దివ్యా దేవరాజన్ ఈశ్వర్‌ను వాపస్ తెప్పించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జీఏడీ ఎన్నారై విభాగం ద్వారా రియాద్‌లోని ఇండియన్ ఎంబసీకి, ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రికి లేఖలు రాయించారు. గల్ఫ్ కార్మికుడు ఈశ్వర్ దీనగాథకు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఎడారిలో అతను పడ్డ ఏడేళ్ల తపనకు తెర పడింది. సౌదీ అరేబియాలో ఖర్జూరాలను పండించిన ఆ తెలంగాణ వలస జీవి, మాతృభూమికి రావడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. సౌదీ నుంచి హైదరాబాద్‌కు ఆదివారం చేరుకోనున్నారు. గ్లోబల్ తెలంగాణ ఫోరం అధ్యక్షుడు, సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నివసించే, కరీంనగర్‌కు చెందిన సామాజిక సేవకులు మహ్మద్ జబ్బార్ ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేసి ఈశ్వర్‌ను ఇంటికి వెళ్లడానికి మార్గం సుగమం చేశారు. సౌదీ నుంచి స్వగ్రామానికి వెళ్లే ఆనందంలో బావోద్వేగంతో గల్ఫ్ కార్మికుడు తాళ్లపల్లి ఈశ్వర్ ఏడున్నవే నా పల్లె.. నువ్వు ఏడున్నవే నా తల్లీ.. బతుకు దెరువు కోసం బాట పట్టినా.. పొట్ట తిప్పల కోసం సౌదీ కొచ్చినా.. అంటూ స్వయంగా పాడిన పాటను ఐఏఎస్ అధికారి దివ్యా దేవరాజన్‌కు అంకితం చేశారు.



తాళ్లపల్లి ఈశ్వర్

సైకిల్ సవారీ.. రోగాలు పరార్

- సైక్లింగ్‌తో ఉపయోగాలెన్నో.. » అనారోగ్యాలకు చెక్ » కొవ్వు కరిగించడంలో భేష్ » పర్యావరణానికి తోడ్పాటు



లింగాలఘణపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మూడు పదులు నిండక ముందే కీళ్ల నొప్పులు.. కాసింత నడుస్తారో లేదో ఆయాసం.. మూడడుగులు వేయకముందే మోకాళ్ల నొప్పులు.. ఇలా అనేక రకాల సమస్యలతో సతమతమయ్యేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఇందుకు ప్రధాన కారణం ఒంటికి సరైన వ్యాయామం లేకపోవడమే కాకుండా చీటికిమాటికి వాహనాలను వినియోగించడం. కూరగాయలు కొనాలన్నా.. పాల ప్యాకెట్ తేవాలన్నా ఆఖరికి ప్లే గ్రౌండ్‌కు వెళ్లాలన్నా బైక్ వెంట తీసుకెళ్లాల్సిందే. వ్యాయామానికి ఉపకరించే ఎలాంటి నిర్వహణ ఖర్చులేని పేదోడి వాహనం సైకిల్‌ను తొక్కేవారి సంఖ్య ఏటేటా తగ్గిపోతుంది. వాహనాలను వినియోగించేవారి సంఖ్య మాత్రం పెరిగిపోతూ వాతావరణం కాలుష్యమవుతుంది. దీంతో అనేక రకాల ఆరోగ్య సమస్యలతో ఎంతో మంది బాధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సైకిల్‌ను వాడితే ఆరోగ్యం.. ఖర్చు లేకుండా పొదుపుతో పాటుగా పర్యావరణ హితులుగా నిలిచే అవకాశం ఉంటుంది.

అనారోగ్య సమస్యలకు చెక్

సైకిల్.. ఎలాంటి ఇంధన ఖర్చు అవసరం లేని వాహనం. కాలంతో పాటు పరుగెడుతున్న ఈనాటి పరిస్థితుల్లో మోటార్ వాహనాల వినియోగం పెరిగిపోతోంది. ద్విచక్ర వాహనాల వినియోగంతో పని సులువుగా అయిపోవడమే కాకుండా ఎలాంటి శ్రమ లేకుండానే పని పూర్తి చేయొచ్చనే భావన నేటితరంలో అధికమైంది. దీంతో రెండు దశాబ్దాల క్రితం దాకా ఆరోగ్య ప్రదాయినిగా నిలిచిన సైకిల్‌ను ఇప్పుడు చాలా మంది చులకనగా చూస్తున్నారు. సైకిల్ వినియోగించేవారి సంఖ్య పడిపోయింది. అయితే సైకిల్ వాడకంతో అనేక రకాల వ్యాధులకు చెక్ పెట్టవచ్చు ప్రధానంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు సైకిల్ తొక్కడం వల్ల షుగర్ అదుపులో ఉంటుంది. దీంతో పాటే ఖరీదైన పెట్రోల్ వాడకం తగ్గించుకునే పొదుపు మంత్రంతో విదేశీ మారకద్రవ్యాన్ని సైతం మిగిల్చిన వారమవుతాం.

ఆరోగ్యానికి హాయి..

సైకిల్ తొక్కడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు సైకిల్ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాయి. సైకిల్ తొక్కడంతో గంటకు సుమారు 300 కేలరీల శక్తి ఖర్చవుతుంది. తద్వారా శరీరంలో కొవ్వు పేరుకోకుండా ఉపయోగపడుంది. స్థూలకాయులకు ఇది మంచి వ్యాయామంగా పనిచేస్తుంది. ప్రతీ వంద మందిలో 10-15 మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. అయితే వీరంతా చీటికి మాటికి మోటారు వాహనాలను వినియోగిస్తున్నవారు కావడం గమనార్హం. ఇలాంటి వారు సైకిల్ తొక్కడం వల్ల కొవ్వు తగ్గించుకుని ఆరోగ్యంగా ఉంటారు. నిత్యం సైకిల్‌ను సవారీ చేయడం వల్ల గుండె, ఊపిరితిత్తులు, నాడీ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. మామూలు వారికంటే సైకిల్ తొక్కేవాళ్లు చురుగ్గా కనిపిస్తుంటారు. ప్రతిరోజూ ఉదయం కొద్ది సేపు సైక్లింగ్ చేయడంతో హృదయ సంబంధిత సమస్యలు దూరమవుతాయని గుండె వైద్యనిపుణులు చెబుతున్నారు.

పర్యావరణానికి ఎంతో మేలు..

సైకిల్ వినియోగంతో అనేక రకాల ప్రయోజనాలు చేకూరుతాయి. దీని వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. మోటారు వాహనాల వినియోగం తగ్గించడంతో పాటు ఇంధన వినియోగాన్ని అదుపులో పెట్టుకోవచ్చు. సాధారణంగా ఏ వాహనంలో కూడా వంద శాతం ఇంధనాన్ని వినియోగించుకునే పరిస్థితులు ఉండవు. దానిలో సరాసరి రెండో వంతు గాలిలో కలిసి పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతుంది. దీంతో పాటు వాహనాల నుంచి వెలువడే పొగతో ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో సైకిల్‌ను వినియోగిస్తే ఎలాంటి సమస్యలు ఉండకపోవడమే కాకుండా పెరుగుతున్న ఆర్థిక భారాన్ని నియంత్రించే వీలుంటుంది. ఇందుకోసం ఇప్పుడు అనేక దేశాల్లో సైకిల్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కొంతమంది పర్యావరణ హితులు వేల కిలోమీటర్ల దూరం సైకిల్ యాత్రను చేపడుతూ అవగాహన కల్పిస్తుండడం విశేషం.

తప్పించుకున్నా.. తప్పదు

- వాహనదారులపై చలాన్ కొరడా
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు
- ఉల్లంఘనుల ఫొటోలు ప్రజలు సైతం తీయొచ్చంటున్న పోలీసులు

వరంగల్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ పోలీసుల కళ్లు గప్పి తప్పించుకున్నామనుకుంటే పప్పులో కాలేసినట్లే.. దారిలో ఉన్న జంక్షన్లలో విధుల్లో ఉన్న పోలీసులు నిబంధనలు పాటించని వాహనదారుల నెంబర్ ప్లేట్లను కెమెరాల్లో బంధించి చలాన్ల రూపంలో జరిమానా విధిస్తున్నారు. కొంత మంది వాహనదారులు పోలీసులు ఫొటోలు తీసింది గమనించి కూడా జరిమానా వేసినప్పుడు చూద్దాంలే.. అన్నట్లు తేలికగా తీసుకుంటున్నారు. వేల రూపాయలు జరిమానా విధించేదాకా తెలియకుండా రోడ్లపై వాహనాలపై తిరుగుతున్నారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డప్పుడు వెలుగులోకి వచ్చే పెండింగ్ చలాన్లను చూసి షాక్‌కు గురవుతున్నారు. మరికొందరు పోలీసులకు పట్టుబడకుండా నగరంలోని షార్ట్‌కట్ దారుల్లో ప్రయాణిస్తున్నారు.

పెండింగ్ చలాన్లు, చోరీ చేసిన బైకులు

ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా చేస్తున్న తనిఖీల్లో ఎక్కువ మొత్తంలో ఉన్న పెండింగ్ చలాన్ల వాహనాలతో పాటు చోరీ చేసిన ద్విచక్రవాహనాలు పట్టుబడుతున్నాయి. 2024 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలోని మహబూబాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, ధర్మసాగర్, సుబేదారి, కొండాపూర్, సదాశివపేట, గోదావరిఖని, కాటారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆకివీడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీకి గురైన సుమారు 14 ద్విచక్రవాహనాలను హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు తనిఖీల్లో గుర్తించి వాహనాలను బాధితులకు అందజేయడంతో పాటు నేరస్తులను స్థానిక పోలీసులకు అప్పగించారు. జూన్ నెలలో కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ వెంకన్న ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా హనుమకొండ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఏకంగా 233 పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు, వాటి జరిమానా సుమారు రూ.45,300తో పట్టుబడ్డాడు. జూన్ 4న హనుమకొండ పీఎస్ పరిధిలోని అశోక జంక్షన్‌లో సీఐ సీతారెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా 109 పెండింగ్ చలాన్లు, వాటి జరిమానా రూ.26,310తో ఓ వాహనదారుడు పట్టుబడ్డాడు. అయితే వాహనం ధర కన్న పెండింగ్ చలాన్ల జరిమానా ఎక్కువగా ఉండటంతో చెల్లించకుండా వాహనాన్ని వదిలేసుకుంటున్నారు. పాత వాహనాలు కొనుగోలు చేస్తున్న సమయంలో తప్పనిసరిగా పెండింగ్ చలాన్ల వివరాలు తెలుసుకునే కొనుగోలు చేయాలని పోలీస్‌శాఖ సూచిస్తోంది.



వాహనదారుడి చలాన్లను చూపిస్తున్న సీఐ వెంకన్న

ప్రజల ఫొటోలకూ జరిమానాలు విధింపు

నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడే వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు, లాఅండ్‌ఆర్డర్ పోలీసులే జరిమానా విధించడం కాదు.. ప్రజలు సైతం తమ ఫొటోల ద్వారా పరోక్షంగా జరిమానాలు విధిస్తున్నారు. రోడ్లపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారంగా ప్రయాణించే వాహనదారులతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలను ఫొటోలు తీసి ట్రాఫిక్ పోలీసులకు వాట్సాప్‌లో పంపిస్తే వాటిని పరిశీలించి జరిమానా విధిస్తున్నారు. నిత్యం జరిగే ట్రాఫిక్ ఉల్లంఘనలను ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులే గమనించాల్సిన అవసరం లేదని, బాధ్యతగల పౌరులు సైతం ఉల్లంఘనుల ఫొటోలు తీసి పంపిస్తే కొంత మేరకు ఉల్లంఘనలను నియంత్రించవచ్చే ఆలోచనతో ప్రజలు పంపించే ఫొటోలు పరిశీలించి జరిమానాలను విధిస్తున్నామని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. ట్రాఫిక్‌కు పెద్దగా అంతరాయం లేకుండా వచ్చే ఫొటోల్లో వాహనదారుడికి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాయితీల కోసం వేచి చూడొద్దు
ట్రాఫిక్ ఏసీపీ తీర్థాల సత్యనారాయణ



వాహనదారులు ముందుగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు, జరిమానాలకు దూరంగా ఉండొచ్చు. నిబంధనలు తెలిసినా మాటిమాటికి ఉల్లంఘిస్తూ జరిమానాల చెల్లింపుల్లో రాయితీల కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటి రాయితీలకు అవకాశం లేదు. ఈలోపు పోలీసులకు పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తాం. నిబంధనలు ఉల్లంఘించినట్లనిపిస్తే ఆన్‌లైన్‌లోని ఎం వాలెట్ యాప్‌లో చూసుకొని జరిమానాకు గురైనట్లు ఉంటే వెంటనే చెల్లించాలి. పోలీసులే ఫొటోలు తీయాల్సిన అవసరం లేదు నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజలే రోడ్లపై ఫొటోతీసి పంపిస్తున్నారు వాటికి సైతం జరిమానాలు విధిస్తున్నాం. పోలీసులు గమనించిన, గమనించకపోయిన నిబంధనలు పాటిస్తే ఏ చిక్కు ఉండదు.

ఇక్కడ ఉంటాం.. అక్కడ ఉంటాం..

- పంద్రాగస్టు వేడుకల్లో ఉరుకులు పరుగులు
- ఖిలావరంగల్, పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేడుకలకు ఒత్తిడితో హాజరు

వరంగల్ క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు వేడుకల్లో ఉరుకుల పరుగుల వాతావరణం కనిపించింది. గ్రేటర్ వరంగల్‌లోనే రెండు జిల్లాలకు సంబంధించిన పంద్రాగస్టు వేడుకలు నిర్వహించగా కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు రెండుచోట్ల హాజరుకావడానికి నానా హైరానా పడ్డారు. అత్యవసం లేకున్న హాజరుకావాలనే అతృతతో సైరన్ వినియోగించి పరుగులు తీశారు. ఓ పోలీస్ అధికారి రాష్ట్ర ఉత్తమ సేవా పతకంతో పాటు జిల్లా యంత్రాంగం ఇచ్చే ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రానికి ఎంపికయ్యాడు. హనుమకొండ పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఓ అవార్డు తీసుకొని అక్కడి నుంచి వరంగల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనువాస్‌రెడ్డి చేతుల మీదుగా మరో అవార్డు అందుకోవడానికి ఆగమేఘాల మీద పరుగెత్తాడు.

మరో అధికారి హనుమకొండ పరేడ్‌గ్రౌండ్‌లో మంత్రికి గౌరవ వందనం సమర్పించి, ఓ ప్లాటూన్‌కు ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించి జిల్లా ఉత్తమ ఉద్యోగ ప్రశంసాపత్రం అందుకునేందుకు హడావిడిగా ఖిలావరంగల్‌లో జరిగే పంద్రాగస్టు వేడుకలకు హాజరుకావడం కనిపించింది. ఓ ప్రజాప్రతినిధి సైతం మంత్రి ప్రసంగం జరుగుతుండగానే మధ్యలోనే స్టేజీపై నుంచి వెళ్లిపోయి ఖిలావరంగల్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కనిపించారు. ఇలా అక్కడ ఉంటాం... ఇక్కడ ఉంటాం.. అన్న సినిమా డైలాగు చందంగా చాలామంది అక్కడ, ఇక్కడ కనిపించారు.

తీజ్ పండుగను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలి

- హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ
- గిరిజన భవన్‌లో ఘనంగా తీజ్ సంబరాలు



తీజ్ వేడుకల్లో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

వడ్డెపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తీజ్ పండుగను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గ్రేటర్ వరంగల్ తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన తీజ్ ఉత్సవాలను శనివారం ఆయన సందర్శించారు. బంజారాల ఆరాధ్య దైవాలు తోఁరామా యాడి, సంత్ సేవాలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను బంజారా సమాజం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. బంజారా సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, బంజారా నేతలు ఆంగోతు వినోద్ లోక్ నాయక్, బదావత్ బాలాజీ నాయక్, డాక్టర్ గుగులోతు రాజునాయక్, భూక్యా హేమానాయక్, గుగులోతు సజ్జన్ నాయక్, లకావత్ రవీందర్, డుంగ్రోతు కిశోర్ నాయక్, భూక్యా సాంబయ్య నాయక్, కిషన్ నాయక్, మాలోతు నానునాయక్, అజ్మీరా ప్రియాంక నాయక్, ఆంగోతు రమాబాయి, మాజీ జడ్పీటీసీ కేలోతు సత్తమ్మ, భూక్య సునీత, శ్రీలత రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధరమ్‌సింగ్‌కు 'హ్యూమానిటేరియన్' అవార్డు

53 సార్లు రక్తదానానికి గుర్తింపుగా ప్రదానం

హనుమకొండ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హనుమ కొండకు చెందిన ఠాకూర్ ధరంసింగ్‌కు 'హ్యూమాని టేరియన్ ఎక్సలెన్స్-2025' జాతీయ అవార్డు దక్కింది. యేటా క్రమం తప్పకుండా మూడు సందర్భాల్లో మొత్తం గా 53సార్లు రక్తదానం చేసినందుకు గుర్తిం పుగా ధరంసింగ్ అవార్డు పొందారు. స్వాతం త్ర్య దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం రాత్రి న్యూఢిల్లీలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. 'ఐకెన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యులు సంతోష్ భగదోరియా హాజరయ్యారు. వివిధ రంగాల్లో సేవా, సామాజిక కార్యక్రమాలు చేపట్టిన అవారికి హ్యూమానిటేరియన్ ఎక్సలెన్స్ జాతీయ స్థాయి అవార్డులను ప్రదానం చేశారు. హనుమకొండకు చెందిన ఠాకూర్ ధరంసింగ్ ప్రభుత్వ ఉద్యోగి. రాష్ట్ర భూగర్భ జల శాఖలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. గతంలోనూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి అవార్డులను పొందారు. అవార్డు దక్కడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. యేటా జనవరి 23 (సుభాష్ చంద్రబోస్ జయంతి), జూన్ 14 (ప్రపంచ రక్తదాన దినోత్సవం), సెప్టెంబర్ 27(భగత్‌సింగ్ జయంతి) సందర్భాల్లో రక్తదానం చేస్తానని ఈ సందర్భంగా ఠాకూర్ ధరంసింగ్ తెలిపారు. రక్తదానం ఎంతో గొప్పదని దీనిపై ముఖ్యంగా యువతను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.



న్యూ ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు సంతోష్ భగ్‌ధోరియా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఠాకూర్ ధరంసింగ్

లోతట్టు ప్రాంతాలు జలమయం



మల్హర్ మండలంలో అలుగు పడిన బొగ్గులవాగు ప్రాజెక్టు



మంగపేట మండలంలో పొంగిపొర్లుతున్న గౌరారం వాగు



కన్నాయిగూడెంలో వర్షానికి నేలమట్టమైన ఇల్లు



ఏటూరునాగారం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు



కాటారం శంకరంపల్లి వద్ద వరదనీటిలో మునిగిన పత్తి చేను

మంగపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు జోరుగా వాన కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలలోకి వరద నీరు చేరింది. పంట పొలాలు నీట మునిగాయి. కొత్తపేటలో మల్లూరు ప్రాజెక్టు కట్టు కాల్వపై నుంచి వరద నీరు పొంగి నాలుగు ఇళ్లలోకి చేరాయి. తెల్లవారిన తర్వాత నీరు బయటకు వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. జోరు వాన వల్ల కమలాపురం ఎర్రవాగు, మంగపేట గౌరారంవాగు, మల్లూరు వాగు, చుంచుపల్లివాగు, రాజుపేట సమీపంలోని ముసలమ్మవాగు ఉరుకలేశాయి. దీంతో వాగుల ఒడ్డులు కోతకు గురయ్యాయి. దీనికి తోడు బూర్గంపహాడ్- ఏటూరునాగారం ప్రధాన రహదారిపై పలుచోట్లా వరద నీరు ఎక్కిపోయి మోకాళ్ల లోతుతో పారకం జరిగింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరద పోటు వల్ల మంగపేట, గంపోనిగూడెం తదితర గ్రామాల సమీపంలో ప్రధాన రహదారి భారీగా కోతకు గురైంది. పంట పొలాల్లో వరద నీటితో మునిగిపోయాయి. శనివారం వాన లేకపోవడంతో ఆ నీరు బయటకు వెళ్లింది.

పత్తి చేలల్లోకి చేరిన వరదనీరు

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సుమారు 5సెం.మీల వర్షాపాతం నమోదు కావడంతో పలు చోట్ల పంట పొలాల్లోకి వరద నీరు చేరి రైతాంగాని కి నష్టం వాటిల్లింది. పలు గ్రామాల పరిధిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్ల చుట్టూ, రహదారిపై వరదనీరు చేరి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షందాటికి గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగి పరీవాహక ప్రాంతంలోని వరి పొలాలు వరద నీటితో చెరువును తలపిస్తున్నాయి. పలు గ్రామాల పరిధిలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి.

పొంగిన వాగులు, వంకలు

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. వాగులు, ఒర్రెలు పొంగి పొర్లాయి. ఐలాపూర్ చుట్టూ ఉన్న వాగులు పొంగి ఉధృతంగా ప్రవహించడంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. బుట్టాయిగూడెంకు చెందిన కావేరి సుధాకర్‌కు చెందిన పెంకుటిల్లు నేలమట్టమైంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

ఏటూరునాగారం రూరల్(ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం అర్థ రాత్రి జోరువాన కురిసింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి తోడు మండలంలో కుండబోత పడగా వాగులు, వంకలు ఉరకలేస్తున్నాయి. దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కొండాయి, మల్యాల, ఐలాపురం, గోవిందరాజుల కాలనీ వాసులు రాకపోకలను పడవ ద్వారా కొనసాగిస్తున్నారు. మండలంలోని బానాజీ బంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాల మధ్య గల జంపన్నవాగుకు వరద తాకిడి పెరగడంతో వాగు ఉరకలేస్తోంది. దీంతో అధికారులు ఎలిశెట్టిపల్లి వాసుల రాకపోకలు సాగించేలా వాగు వద్ద పడవను ఏర్పాటు చేశారు. దీంతో ఎలిశెట్టిపల్లివాసులు పడవ ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు.

నిలిచిన రాకపోకలు

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో కాటారం మేడారం రోడ్డులో కేశాపూర్ వద్ద పెద్దవాగు లోలెవల్ కల్వర్టు, మహాముత్తారం సబ్‌స్టేషన్ వద్ద కోనంపేట వాగు లోలెవల్ కల్వర్టు పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. శనివారం సాయంత్రం వరకు ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మహాముత్తారం కస్తుర్బా విద్యాయంలో వంట పని చేసే మహిళలు శనివారం ఉదయం విధులకు వెళ్లడానికి వాగు వద్ద దాటే పరస్థితి లేకపోవడంతో వెనుదిరిగారు. వజినపెల్లి, కేశాపూర్ మహాముత్తారం సహా పలు గ్రామాల్లోని వాగులకు సమీపంలో ఉన్న పంట పొలాలు, చేన్లు వరద నీటిలోనే ఉన్నాయి. భారీ వర్షాలతో చెరువులు మత్తడి పడటంతో గంట వర్షం పడిన వరద ప్రవహం వాగుల్లోకి వస్తోంది. దీంతో లోలెవల్ కల్వర్టుల వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరించుకున్నాయి. మీటరున్నర ఎత్తులో మానేరు ప్రవాహం సాగుతోంది. ఎగువన కురిసిన వర్షాల వల్ల మానేరులో వరద ఉధృతి పెగే అవకాశం ఉంది. మండలంలోని ఎడ్లపల్లిలోని బొగ్గులవాగు ప్రాజెక్టు ఎగువన కురిసిన వర్షాల వల్ల వరద పోటెత్తడంతో అలుగుపడింది.

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

మహదేవపూర్ రూరల్(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందన గోదావరి తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహదేవపూర్, పలిమెల పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. ఎగువన కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో ఆ వరద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఎల్లంపల్లి గేట్లు ఏక్షణాన్నైనా ఎత్తే అవకాశం ఉందన్నారు. అక్కడ గేట్లు ఎత్తుతే అన్నారం, మేడిగడ్డ బ్యారేజీ గేట్లు ఇప్పటికే ఎత్తి ఉన్నందున ఏక్షణాన్నైనా వరద ఉగ్రరూపం దాల్చొచ్చని పేర్కొన్నారు. మహదేవపూర్, పలిమెల మండలాల గోదావరి తీరప్రాంత ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పవన్ కుమార్ ప్రజలకు సూచించా రు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారం జంపన్నవాగు పరివాహక ప్రాంతాల్లో అధికారులు, నాయకులు పర్యటించారు. ములుగు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కల్యాణి, ఆర్డీవో వెంకటేశ్, ములుగు డీఎస్పీ రవీందర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శంకర్, ఇరిగేషన్ డీఈఈ సదయ్య, డీపీవో దేవరాజ్, స్థానిక తహసీల్దార్ సురేష్‌బాబు, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీవో సుమనావాణి, కాంగ్రెస్ నాయకులు కలిసి వాగు ఉధృతిని పరిశీలించారు. మేడారం, ఊరట్టం, నార్లాపూర్, పడిగాపూర్, వెంగళాపూర్ గ్రామాల పరిసరాలు నీట మునుగగా పంట పొలాలను పరిశీలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోల్లు దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

దర్జాగా చెరువుకట్ట కబ్జా!

మంగపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కోమటిపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న మామిడికుంట చెరువుకట్టను కొందరు దర్జాగా కబ్జా చేశారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ప్రభుత్వ భూమిని అడ్డంగా ఉన్న చెట్లను నేలమట్టం చేసి చదును చేశారు. ఇంత జరిగినా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ, జీపీ అధికారులు చేతులు తడిపి ఈ అక్రమణ చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఆక్రమణను అరికట్టి ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిట్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బుర్ర రాజయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ నాగపూరి రాజమౌళి బాధిత కుటుంబ సభ్యులను పరిమర్శించారు. రాజయ్య మృతదేహం వద్ద నివాళ్లు అర్పించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్, నాయకులు మణికుమార్, రాహుల్ ఉన్నారు. అలాగే మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్‌లు రాజయ్య మృతదేహం వద్ద నివాళ్లు అర్పించారు. మృతుడి కుమారులు సీనియర్ పాత్రికేయులు చక్రపాణి, హోంగార్డు దేవేందర్‌ను ఓదార్చారు. వారివెంట పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తౌటం నవీన్, మండల ప్రధానకార్యదర్శి ఏరుకొండ రాజేందర్, నాయకులు తిరుపతి, పెరుమాండ్ల రవీందర్, చిలుముల రమణాచారి, నగేష్ ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

వెంకటాపురం, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి) : గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణపై కొందరు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండల కేంద్రంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పూనెం సాయి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం జీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మండలంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మించుకునే గిరిజనేతరులతో బేరసారాలు చేసే వ్యక్తులు అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం చేసే వ్యక్తులు తమ పద్ధతిని మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి

వాజేడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు జాగటి రవితేజ, టి.ఎల్.రవి అన్నారు. పాఠశాలను ఆయన శనివారం సందర్శించి పాఠశాలలో పలు సమస్యలను గుర్తించామన్నారు. ముఖ్యంగా పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వర్షపు నీరు నిల్వ ఉంటోందని, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని తెలిపారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు సాయి ఉన్నారు.

20 లీటర్ల గుడుంబా పట్టివేత

ఏటూరునాగారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గుడుంబా సరఫరా చేస్తున్న వ్యక్తులను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాయిగూడెం మండలం గుర్రంపేట గ్రామంలో గుడుంబా విక్రయాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి శనివారం మధ్యాహ్నం ఆ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 60 ఏళ్ల కోగిల చిన్న నర్సయ్య అనే వ్యక్తి గుడుంబా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన అంజన్‌రావు వద్ద గుడుంబాను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నట్టు నర్సయ్య అంగీకరించాడు.దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గేట్ వాల్వ్ లీక్.. కలుషితమవుతున్న తాగునీరు



గేట్ వాల్వ్ లీకై కలుషితమవుతున్న మిషన్ భగీరథ నీరు

మంగపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కోమటిపల్లి క్రాస్ సమీపంలో వారం రోజుల క్రితం గేట్ వాల్వ్ లీకై తాగునీరు కలుషితమవుతోంది. గేట్ వాల్వ్ లీకేజీలకు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవరించడం వల్ల మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. పైపుల్లోకి కలుషిత నీరు కలిసి గ్రామస్థులకు సరఫరా అవుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా గేట్ వాల్వ్‌ను సరిచేయాలని కోరుతున్నారు.

భూకబ్జా దారులపై చర్యలు తీసుకోవాలి

రేగొండ, ఆగష్టు 16(ఆంధ్రజ్యోతి) : గౌడ పారిశ్రామిక సంఘానికి చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన గౌడ కులస్థులు భూపాలపల్లి జిల్లా కోర్టు కమిషనర్ విష్ణును కోరారు. మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన 200 కుటుంబాలు సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకొని 18ఎకరాల 30 గుంటల భూమిని కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేశారు. కాగా కొందరు వ్యక్తులు ఆ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని భూపాలపల్లి జిల్లా కోర్టును సంప్రదించారు. దీంతో కోర్టు జిల్లా కోర్టు జడ్జి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి అడ్వకేట్ కమిషనర్ విష్ణును విచారణకు పంపించారు. ఈ క్రమంలో ఆయన శనివారం కనిపర్తి గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా గౌడ కులస్థులను వివరాలు, సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. గౌడ కులస్థులు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గీత పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు శ్రీపతి స్వామిగౌడ్, గౌడ కులస్థులు భద్రయ్య, శ్రీహరి, రవి, రఘుపతి, అర్జున్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ



ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిలో ఉన్న ఐసీయూలో అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు సూచించారు. శనివారం వంద పడకల ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ ఔట్ పోస్ట్, సెక్యూరిటీ సిబ్బందిని పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఇటీవల వార్డులోకి నీరు రావడాన్ని పరిశీలించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలతో అప్రమత్తంగా ఉండాలని ఏఈ రవికిరణ్‌కు సూచించారు. ఆయన వెంట భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై సాంబమూర్తి ఉన్నారు.

సమ్మక్క సాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మొత్తం 59 గేట్లు ఎత్తిన అధికారులు

కన్నాయిగూడెం , ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. కొన్ని రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువన ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతుండటంతో గోదావరి పెరుగుతూ ఉంది. ఇంద్రావతి, ప్రాణహిత నదుల నుంచి భారీగా వరద నీరు వచ్చి గోదావరిలో చేరి ప్రవహిస్తూ ఉండటంతో గోదావరి ప్రవాహం గంట గంటకూ పెరుగుతూ ఉంది. ఎగువ నుంచి 4,60,340 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని మొత్తం 59 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుం నీటిమట్టం 79.40 మీటర్లు ఉంది.

కిసాన్ సేవా సంఘం డివిజన్ కమిటీ ఎన్నిక

కాటారం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని పల్లె ప్రకృతి వనం వద్ద శనివారం కిసాన్ సేవా సంఘం కాటారం డివిజన్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఐదు మండలాలకు చెందిన ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు కిసాన్ సేవా సంఘం పేరిట డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. తోడె అనిల్, దాసరి రాజన్న, గడ్డం శంకర్‌లింగం ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా తోట సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా నిడిగొండ చెన్నకేశవ్, కోశాధికారిగా ఇప్పలపల్లి దేవేందర్, ఉపాధ్యక్షులుగా సంబరాతి అనిల్, నార రమేష్, సంయుక్త కార్యదర్శులుగా జాగరి రాజబాపు, పయ్యావుల నరేష్, సహాయ కార్యదర్శులుగా పెండ్లి రత్నాకర్, ఇనుకొండ సంపత్‌రెడ్డి, ప్రచారకార్యదర్శిగా దానం రంజిత్, ముఖ్య సలహాదారులుగా శంకర్‌లింగం, అనిల్‌రెడ్డి, పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కమిటీ ప్రతినిధులను సభ్యులు ఘనంగా సన్మానించారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి కుటుంబానికి పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బుర్ర రాజయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారులు బుర్ర చక్రపాణి, దేవేందర్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి మధువంశీకృష్ణ, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొమురు, కామిడి రత్నాకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ బుర్ర శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, యూత్ టౌన్ అధ్యక్షుడు అల్లం రాజు తదితరులు ఉన్నారు.

వికలాంగుల పెన్షన్లు పెంచాలి

కాటారం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వికలాంగుల పెన్షన్‌ను ప్రభుత్వం వెంటనే రూ.6 వేలకు పెంచాలని, లేదంటే వారితో కలిసి హైదరాబాద్‌ను అష్టదిగ్బంధనం చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి దుమ్ము వెంకటేశ్వర్లు, ఎంఎస్‌పీ జిల్లా ఇంచార్జి రుద్రారపు రాంచందర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో శనివారం వికలాంగుల హక్కుల పోరాట సమితి డివిజన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. ఈనెల 20న మంథనిలో జరిగే సింహగర్జన సన్నాహక సభకు పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చే యాలని కోరారు వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు చంద్రమౌళి, చిరంజీవి, శ్రీనివాస్, రవీందర్, సమ్మయ్య, దేవక్క తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన గోదావరి



కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిలా కాళేశ్వరంలో త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం పెరిగింది. శనివారం 8.23 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తోంది. ప్రాణహిత, గోదావరి నదులకు వరద పెద్ద ఎత్తున పెరగడంతో త్రివేణి సంగమ గోదావరి పరవళ్లు తొక్కుతోంది.

పేరూరు వద్ద..

వాజేడు (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరికి వరద ప్రవాహం పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరడంతో ములుగు జిల్లా వాజేడు మండలంలో గోదావరి పెరుగుదల ప్రారంభమైంది. మండలంలోని పేరూరు వద్ద శనివారం సాయంత్రం గోదావరి నీటిమట్టం 13.10 మీటర్లు ఉందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. మండలంలో శుక్రవారం అర్ధరాత్రి కుండపోత వర్షం కురవగా మండలంలోని ప్రగళ్లపల్లి చెరువు మత్తడి పోస్తోంది. దీంతో కింది భాగం కొట్టుకొని పోకుండా పంచాయతీ సిబ్బంది ఇసుక బస్తాలను నింపి ముందస్తు చర్యలు చేపట్టారు. అదే విధంగా మేడిగడ్డ, కడెం ప్రాజెక్టుల నుంచి భారీగా వరద నీరు వచ్చే అస్కారం ఉందని రెవెన్యూ అధికారులు మండల ప్రజలను అప్రమత్తం చేశారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దామెరకుంట సమీపంలో గోదావరి, మానేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అతి భారీ వర్షాలకు తోడు కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. శనివారం సాయంత్రం వరకు కడెం ప్రాజెక్టు నుంచి 17గేట్లు ఎత్తి 2లక్షలకు పైగా క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 20గేట్లు ఎత్తి 68వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రాత్రి వరకు వరద పెరిగే అవకాశం ఉందని గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

రాత్రిపూట.. కుండపోత

(5వ పేజీ తరువాయి)

రాత్రి కురిసిన వర్షానికి కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరుచేరింది. సైడ్ డ్రెయినేజీ లేకపోవడంతో లోతట్టుగా ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం ఇళ్లను పరిశీలించారు. ఈ కాలనీలో సైడ్ డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, కొంత మంది అభ్యంతరం తెలపడం వల్లే జరగడం లేదని స్థానిక నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే పనులు చేపట్టేలా చూడాలని మునిసిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

- నేలకొరిగిన భారీ వేపవృక్షం

కుండపోత వర్షంతో అంబేద్కర్ కూడలిలో ఉన్న భారీ వేప వృక్షం నేలకొరిగింది. అయితే, ఇదే వృక్షం కింద హనుమకొండ, కాటారం వైపు వెళ్లేందుకు ప్రయాణికులు వేచి చూస్తుంటారు. ఈ క్రమంలో ఉన్నట్టుండి ఈ వృక్షం శబ్దం చేస్తూ శనివారం మధ్యాహ్నం నేలకొరిగింది. దీంతో అప్రమత్తమైన సుమారు 20 మంది ప్రయాణికులు పక్కకు పరుగెత్తారు. అదే సమంలో ఆటో వచ్చి ఆగడంతో దానిపైనే పూర్తిగా చెట్టు పడింది. ప్రయాణీకులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ రాజు తలకు స్వల్ప గాయమైంది.

- మోరంచవాగును పరిశీలించిన కలెక్టర్

భూపాలపల్లి మండల పరిధిలోని మోరంచవాగును కలెక్టర్ రాహుల్‌శర్మ శనివారం ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎగువ భాగం నుండి ఎంత వరకు వరద వచ్చే అవకాశం ఉందనే విషయాల్ని అధికారులను అడిగి తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం జిల్లాకు రెడ్ అలర్ట్ అని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లపై ప్రవహించే నీళ్లలోంచి ఎవరూ దాటకుండా చర్యలు చేపట్టాలని, భారీ కేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

(5వ పేజీ తరువాయి)

బూర్గల లక్ష్మయ్య, కోశాధికారి ఎడ్ల రమేష్, సంయుక్త కార్యదర్శి ఆరెపల్లి తిరుపతి, ముఖ్య సలహాదారులు బండారి చేరాలు, నూనేటి రాజు, ముఖ్య సలహారులు బండారి చేరాలు, నేనేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణాష్టమి వేడుకలను మండ ల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని పురవీ ధుల్లో యువకులు, భక్తులు ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాలలో వేడుకలను నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే వేడుకలను స్థానికులు ఉత్సాహంగా జరుపుకున్నారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో దేవాలయాలల్లో ఉట్టికొట్టే కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాల్లో కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేకంగా పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం తహసీల్దార్ జగదీశ్వర్ సూచించారు. రెవెన్యూ శాఖ అధికారులు, కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. మండలంలో ఉన్న చెరువులు, వాగులు, గోదావరి వద్ద ఉన్న గేట్లను పరిశీలించారు. గోదావరి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ సూచించారు. ఆయన వెంట ఆర్ఐ కిరణ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, జిల్లా యూత్ కార్యదర్శి ఎమ్డీ. గౌస్ పాషా తదితరులు ఉన్నారు.

పంట నష్టానికి పరిహారం చెల్లించాలి

• బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న బడే నాగజ్యోతి

తాడ్వాయి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వరదలతో పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం ప్రభుత్వం చెల్లించాలని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని మేడారం జంపన్నవాగు పరీవాహక ప్రాంతాలను బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆమె శనివార పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జంపన్నవాగు పొంగిపొర్లడంతో పరిసర గ్రామాల పంట పొలాలు పూర్తిస్థాయిలో నీట మునిగాయని అన్నారు. అధికారులు సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం చెల్లించాలని అన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, నాయకులు రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, ఎట్టి జగదీశ్, చిడం బాబురావు, ఎం.డి.రఫీక్ కోట సురేష్, గజ్జల సమ్మయ్య, సిద్దబోయిన నర్సింగరావు, ఇర్ప విజయ, మాదరి కేశవరావు, వల్లెపు సారయ్య, గుర్రాల రాజిరెడ్డి, మెందు సమ్మిరెడ్డి, బెండల నర్సయ్య, ఇప్ప సతీష్, ఆలం అర్జున్, చిడం సాగర్ తదితరులు ఉన్నారు.